క్లుప్తంగా

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు షురూ..



గోవిందరావుపేట : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గోవిందరావుపేట సొసైటీ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మిఅనిల్ యాదవ్ మాట్లాడుతూ.. మంత్రి సీతక్క, డీసీసీ ప్రెసిడెంట్ పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు మంజూరు చేశామని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకోవాలని కోరారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



వాజేడు : పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలను పూర్తయ్యేలా చూడాలన్నారు. అదే సమయంలో వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలను తీసుకోవాలన్నారు.

కడుపు నొప్పితో మహిళ మృతి


నిహారిక (ఫైల్)

వాజేడు : మండల పరిధిలోని ఎడ్జెర్లపల్లి గ్రామానికి చెందిన చిలుకూరి నిహారిక (20) కడుపు నొప్పి భరించలేక సోమవారం మృతిచెందింది. తల్లిదండ్రులు చిలుకూరి శ్రీను, భవాని తెలిపిన వివరాల ప్రకారం.. నిహారికకు గతంలోనే వివాహం కాగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తల్లిదండ్రులతో కలిసి ఉంటుంది. అయితే నిహారిక ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులో చేరి 420 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం చదవడానికి సన్నద్ధం అవుతుండగా ఆదివారం ఆమెకు కడుపులో నొప్పి వస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలిపింది. కిడ్నీలో రాళ్లు ఉండటం అప్పుడప్పుడు నొప్పి వస్తుండటంతో అదే నొప్పి అని భావించి ఏటూరునాగారం తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కిడ్నీకి సబంధించిన నొప్పి కాదని వరంగల్ తీసుకువెళ్లాలని సూచించారు. వరంగల్ తరలిస్తుండగా మార్గమధ్యంలో నిహారిక మృతి చెందింది. కూతురు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

విచారణ చేపట్టాలి

ములుగు రూరల్ : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని వాటిపై విచారణ చేపట్టాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేయడంపై అనుమానం వ్యక్తమవుతుందని అన్నారు. నాయకులు గండి కుమార్, వేములపల్లి భిక్షపతి, గొర్రె సమ్మయ్య, మహేష్, రాందాస్, భద్రయ్య, భాస్కర్, చంటి, రాజశేకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు

- అతి వేగంగా దూసుకొస్తున్న లారీలు
- భయాందోళనలో ప్రజలు, వాహనదారులు


ఎదిర సమీపంలో వరుసగా వస్తున్న ఇసుక లారీలు

వెంకటాపురం(కె) : మండలంలోని ఎదిర నుంచి వాజేడు మండలం జగన్నాథపురం గ్రామ సమీపం వరకు రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రమాదకరంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వందలాదిగా ఇసుక లారీ వస్తున్నాయి. ఈ లారీలు వాజేడు మండలం మీదుగా హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా అతి వేగంగా వెళ్తుండటంతో వీటితో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వాహనదారులు, ప్రయాణికులు భయపడుతున్నారు.

నిత్యం ప్రమాదాలే..

వెంకటాపురం, వాజేడు మండలాల్లో ఇసుక లారీల వల్ల ఎక్కడో ఓ చోట నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల వాజేడు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లో వందల సంఖ్యలో వస్తున్న లారీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అతివేగంగా ఇసుక లారీలు..

వెంకటాపురం, వాజేడు మండలాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా వందల సంఖ్యలో ఇసుక లారీలు అతివేగంగా దూసుకు వెళ్తున్నాయి. వీటి వేగానికి సంబంధిత అధికారులు అడ్డుకట్ట వేయాలని మండలవాసులు కోరుతున్నారు. ఒకే సారి పదుల సంఖ్యలో లారీలు దూసుకు వస్తుండటంతో వాహనదారులు, బాటసారులు రోడ్డు దాటేందుకు భయందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి ఇసుక లారీలు మృత్యు లారీలుగా మారకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లారీల వేగాన్ని నియంత్రించాలి



మండలంలో ఇసుక లారీల వేగాన్ని అధికారులు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలి. రోజుకు వందల సంఖ్యలో ఇసుక లారీలు వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక లారీలను రాత్రివేళలో వెళ్లే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఆదినారాయణ, వెంకటాపురం

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వంట కార్మికులు

ములుగు రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. సోమవారం వంట కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పాఠశాలలు ప్రాంభం సమయం వచ్చిన గతేడాది వంట బిల్లులు, కోడిగుడ్ల బిల్లు, వేతనాలు అందించకపోవడం బాధాకరమని అన్నారు. 2023 అక్టోబర్ నుంచి అల్పాహారం బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వంట కార్మికులకు రూ.10 వేల వేతనం అందించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల రాజు, సంఘం జిల్లా అధ్యక్షురాలు సామల రమ, ప్రమీల, భారతీ, లక్ష్మీ, సమ్మక్క, జమున, సుశీల, విజయ, రమణ, వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, సరోజన, సుమతి, తులి, భవాని తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 77మందికి జరిమానా


కమలాకర్, ఎస్సై, పస్రా

గోవిందరావుపేట : మద్యం తాగి వాహనాలు నడిపిన 77మందికి రూ.65వేల జరిమానా, ఐదుగురికి మూడు రోజుల జైలు శిక్ష విధించిన సంఘటన పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మండలంలోని పస్రా చౌరస్తా, గోవిందరావుపేట సెంటర్‌లో కొన్ని రోజుల క్రితం వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్‌ఎనలైజర్‌తో తనిఖీ చేయగా 77మంది మద్యం తాగి ఉన్నట్లు రిపోర్టులో తేలింది. దీంతో వారిని ములుగు జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జ్యోత్స్న న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. కాగా విచారణ చేసి 77 మందికి జరిమానా, జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపొద్దని, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు.

‘విద్యార్థుల జీవితాలతో చెలగాటం’

మంగపేట : ప్రభుత్వ అనుమతి లేకుండా పలు ప్రైవేట్ పాఠశాలల యజమాన్యం విద్యను ప్రైవేటు వ్యాపారంగా మార్చుకుని విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మండలంలోని రాజుపేటలో ప్రభుత్వ, విద్యాశాఖ అనుమతి లేకుండా రిజిస్ట్రేషన్, రికగ్నైజేషన్ అనుమతి లేకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎక్సలెన్స్ ప్రైవేటు పాఠశాలకు చెందిన బ్రాంచ్ పేరుతో పాఠశాలను స్థాపించి విద్యార్థులు పాఠశాలలో చేరాలని ప్రచారం చేయడం విద్యావ్యవస్థకు అన్యాయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయంపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే అక్రమంగా పాఠశాలను నెలకొల్పి విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తున్న పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్ : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించడంతో కలెక్టర్ దివాకర క్రీడాకారులను సోమవారం అభినందించి, సన్మానించారు. నల్లగొండ జిల్లాలో ఇటీవల జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన జాడి రాధిక వరంగల్ బాలికల టీం గోల్డ్ మెడల్, వరంగల్ బాలుర టీం ఎండీ ఇమ్రాన్, జాడి వాసు సిల్వర్ మెడల్ సాధించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడ అధికారి తుల రవి, సర్దార్‌సింగ్, లావణ్య, హ్యాండ్‌బాల్ కోచ్ పర్వతాల కుమారస్వామి, రెజ్లింగ్ కోచ్ సతీష్, సైక్లింగ్ కోచ్ శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికాలనీ ఓట్లను 20వ వార్డులో కలపాలి

ములుగు మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో ప్రగతి కాలనీ ఓట్లను కలపాలని మాజీ వార్డు సభ్యుడు అజ్మీరా అజయ్ నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ సంపత్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా కాలనీవాసులు ఆయనను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ఎనగందుల వెంకటేష్, ప్రదీప్, సందీప్, రాజ నాయక్, ప్రవీణ్, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిర్సాముండా స్ఫూర్తితో ఉద్యమించాలి


బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని కొమురం భీమ్ కాలనీలో సోమవారం గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో బిర్సాముండా వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ.. నీరు, అడవి, భూమిపై హక్కుల కోసం బిర్సాముండా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకోని ఆదివాసీ ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం ప్రతాప్, పర్శిక బాబురావు, పూనెం కృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మేడారం ఇసుక

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవేందర్


సమావేశంలో మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మేడారంలోని జంపన్నవాగు ఇసుక రవాణా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక క్వారీలను నడపిస్తోందన్నారు. మేడారం జంపన్న వాగు నుంచి జిల్లాలోని వెంకటాపూర్, ములుగు మండలాలకు మాత్రమే ఇసుక రవాణా జరుగుదోందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. మేడారంలో ఇసుక దందాపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధారాలతో మాట్లాడాలని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మేడారం జాతర మాజీ చైర్మన్ లచ్చు పటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ముజఫర్, తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, మాజీ ఎంపీపీ ఎనగంటి రాములు, పీఏసీఎస్ డైరెక్టర్లు యానాల సిద్దరెడ్డి, జగదీశ్, నాయకులు గౌని మధు, నర్సింగారావు పాల్గొన్నారు.

నూతన మెనూపై వంట సిబ్బందికి శిక్షణ


కేజీబీవీలో శిక్షణకు హాజరైన వంట సిబ్బంది

ములుగు రూరల్ : విద్యార్థులకు అందించే నూతన ఆహార మెనూపై ములుగు కేజీబీవీలో వంట సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. సోమవారం డీఆర్పీల సమక్షంలో వంట సిబ్బందికి శిక్షణ అందించినట్లు జీసీడీఓ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నూతన మెనూలో పొందుపరిచిన 15 రకాల వంటలను తయారీ విధానంపై శిక్షణ అందించారని అన్నారు. విద్యార్థులకు శుభ్రత, నాణ్యతతో కూడిన భోజనం సకాలంలో అందించాలని వివరించారు. జిల్లాలోని 9 కేజీబీవీలు, 3 బాలికల వసతి గృహాలకు చెందిన వంట సిబ్బందికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జీవనప్రియ, ఉపాధ్యాయులు అర్చన, మమత, రాణీ, సుగుణ, అనిత, మమత, వంట సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న బాధ్యులు


రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

వాజేడు : మండల పరిధిలోని పేరూరు గ్రామంలో సోమవారం సీజనల్ వ్యాధులపై మహిళా సంఘాలకు కాఫెడ్ స్వచ్ఛంధ సంస్థ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పేరూరు హెచ్‌ఈఓ వేణుగోపాల కృష్ణ హాజరై మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి జ్వరాలు వస్తాయని అదే సమయంలో దగ్గు, జలుబు, చర్మ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమతెరలను విధిగా వాడాలని తెలిపారు. వాజేడు, వెంకటాపురం(కె) కోఆర్డినేటర్లు కామేష్, హనుమంతు, రమాదేవి, స్వరూప, ప్రసాద్ ఉన్నారు.

మలేరియా జ్వరాలపై సర్వే

వాజేడు మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో సోమవారం వైద్యాధికారి తరుణ్ ఆధ్వర్యంలో మలేరియా జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో గర్భిణులను పరీక్షించి మందులను ఇచ్చారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, వెంకట రమణ, లలిత కుమారి, మాలతి, శివకుమారి ఉన్నారు.

ఎస్టీయూ ఆవిర్భావ వేడుకలు


సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

ములుగు రూరల్ : స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) 79వ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు జీఓను నిలుపుదల చేయాలని కోరారు. ఈనెల చివరన విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం కృష్ణయ్యను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, పోరిక శంకర్, ఉపాధ్యక్షుడు మూడ్ కసన్ సింగ్, కిష్టయ్య, విష్ణు, రమేష్, విజయ్, సంతోష్, రాజు, రాజుకుమార్ , రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న మిత్రులు

ములుగు రూరల్ : ములుగు జిల్లా సాక్షి రిపోర్టర్ భూక్య సునీల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా 2003–04వ సంవత్సరంలో పదో తరగతి చదివిన మిత్రబృందం బాధిత కుటుంబానికి చేయూతనిచ్చారు. సోమవారం మండలంలోని పత్తిపల్లి పంచాయతీ పరిధి కొడిశాలకుంటలో సునీల్ కుటుంబాన్ని పరామర్శించి రూ.1.36లక్షల నగదును మిత్రుడి కుమార్తె భూక్య నిత్యానందన పేరున సుకన్య సమృద్ధి యోజనలో జమ చేసి రశీదు అందించారు. సునీల్ మరణం జీర్ణించుకోలేని విషయమని మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచేందుకు తమ వంతు సాయం అందించామని పేర్కొన్నారు. సాధన స్కూల్ కరస్పాండెంట్ దుగ్గిరెడ్డి సురేందర్‌రెడ్డి మిత్రుడు సునీల్ పిల్లలకు పదో తరగతి వరకు ఉచితంగా తన పాఠశాలలో చదివిస్తానని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో మలిశెట్టి స్వాతి, యాసం విక్రమ్‌రాజ్, దొంతిరెడ్డి రాకేష్‌రెడ్డి, అన్నం మోహన్ కుమార్, సభావత్ రాజన్న, వక్కల రమేష్, ఎండీ రియాజ్, దొమ్మటి తిరుపతి, నూనేటి మధు ఉన్నారు.

వినతుల వెల్లువ

వాజేడు : మండల పరిధిలోని టేకులగూడెం, చింతూరు, దూలాపురంలో తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ సత్యనారాయణ, ఆర్ఐ కుమారస్వామి సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి 199 వినతులు వచ్చాయి.

గంగాగూడెంలో రెవెన్యూ సదస్సు

కన్నాయిగూడెం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సోమవారం మండలంలోని గంగాగూడెంలో తహసీల్దార్ సర్వర్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. గ్రామంలో భూ సమస్యలు ఉన్న రైతులు తహసీల్దార్‌కు దరఖాస్తులు చేసుకున్నారు. రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


ఎస్ఎస్‌తాడ్వాయి: మాట్లాడుతున్న బుచ్చయ్య

ఎస్ఎస్‌తాడ్వాయి : నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్ పల్లా బుచ్చయ్య అన్నారు. సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన మండల స్థాయి పదాధికారులతో 11సంవత్సరాల మోదీ ప్రభుత్వ వికసిత్ భారత్ అమృతకాలం సేవ సంక్షేమ పరిపాలన మండల కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి భర్తపురం నరేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ద్యాగాల సలేందర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతరెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మాదరి శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి సుభాష్, నాయకులు చెవుగాని రఘు, సుధాకర్, జీడి ప్రశాంత్, కొర్నెబెల్లి సేనాపతి, వెంకన్న, సాగర్, నాగారాజు, భిక్షపతి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే బీజేపీ ధ్యేయం

ఏటూరునాగారం : మహిళా సాధికారతే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో 11వ వార్షికోత్సవ వేడుకలను బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమ లక్ష్యంగా బీజేపీ పనిచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గండెపల్లి సత్యం, ఎర్రల్ల ఎల్లయ్య, వావిలాల జనార్దన్, పలక గంగా, చంద్రారెడ్డి, దుర్గారావు, రాకేష్, అజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే బంగారు భవిష్యత్


వెంకటాపురం(కె) : బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


ఏటూరునాగారం: కొమురం భీమ్ నగర్‌లో..

వాజేడు : ప్రభుత్వ బడిలోనే పిల్లల బంగారు భవిష్యత్ ఉంటుందని వాజేడు ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు అన్నారు. వాజేడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోయం ఆనందరావు ఆధ్వర్యంలో నాగారం, జగన్నాథపురం గ్రామాల్లో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, కుమార్ బాబు, రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

బెస్తగూడెంలో ‘బడిబాట’


వెంకటాపురం(కె) : మండల పరిధలోని బెస్తగూడెం గ్రామంలో సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించడంతో పాటు విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడిలో ఉన్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఉపాధ్యాయులు పుష్పలత, కృష్ణారావు, రాజు, రమణ, కళ్యాణి తదితరులు ఉన్నారు.


వాజేడు: బడిబాట కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ బడిలో చేర్పించండి

ఏటూరునాగారం : బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని సీఆర్పీ శ్రీధర్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కొమురం భీం నగర్‌లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టగా శ్రీధర్ నాయక్ హాజరై ఇంటింటా ప్రచారం చేశారు. చదువుకునే పిల్లలను పనుల్లో పెట్టుకుంటే నేరం అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలను చేర్పించి వారి బంగారు భవిష్యత్‌ను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు, గ్రామస్తులు రమేష్ పాల్గొన్నారు.

విత్తన ఎంపికలో అప్రమత్తంగా ఉండాలి


వెంకటాపురం(ఎం): అవగాహన కల్పిస్తున్న ఏఓ

ఏటూరునాగారం/ వెంకటాపురం(ఎం) : రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం వ్యవసాయ అధికారి శైలజ, ఏటూరునాగారం ఏఈఓ వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏటూరునాగారం క్లస్టర్ పరిధిలోని రైతులకు, వెంకటాపురం(ఎం) మండలంలోని లక్ష్మీదేవిపేట రైతువేదికలో అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలను సర్టిఫైడ్ డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని, వాటికి రశీదు కూడా పొందాలన్నారు. జూన్ చివర, జూలై మొదటి వారంలో వరినాట్లు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీకాంత్, ఏఈఓ దయానా, రైతులు పాల్గొన్నారు.